సాక్షి
కుమురంభీం
శనివారం, 6, జూలై, 2024



జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త
జంతువుల నుంచి సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. జూనోటిక్ వ్యాధులతో పశుపోషకులు, జంతుప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి. 8లో▸



బ్యాగు భారం
ప్రైవేట్ పాఠశాలలు సొంత సిలబస్‌తో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సంఖ్య పెంచుతున్నాయి. బ్యాగుల బరువు మోయలేక విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.3 /26.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంలో చాలాచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి



తిర్యాణిలో మొక్క నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

తిర్యాణి(ఆసిఫాబాద్): నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం కమ్యూనిటీ హాల్ సమీపంలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల ధర్నా



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.6,016కు పెంచాలని డిమాండ్ చేశారు. ఆసరా పింఛన్‌దారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంపులు నిర్మించాలని, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు అందించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో రఫత్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రేగుంట కేశవరావు, ఎండీ ఖయ్యూం, అబ్దుల్ మజీద్, రాజేశ్, కోటేశ్వర్ రావు, అంజన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: జిల్లాలో గంజాయి రవాణా కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో చట్టవిరుద్ధంగా జరిగే నిషేధిత గుట్కా, గంజాయి, పేకాట శిబిరాలు, ఇసుక అక్రమ రవాణా, నిషేధిత గడ్డి మందుతోపాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమ దందాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు నిషేధిత వస్తువుల విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సైలు గంగన్న, వెంకటేశ్, కానిస్టేబుళ్లు మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

9న అతిథి అధ్యాపక, ఉపాధ్యాయుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో అతిథి అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గురుకుల సమన్వయ జిల్లా అధికారి స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్(టి) బాలుర కళాశాలలో జేఎల్ ఇంగ్లిష్, పీజీటీ సోషల్, బాలికల కళాశాలలో జేఎల్ హిస్టరీ, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ మ్యాథ్స్, కాగజ్‌నగర్ గురుకుల పాఠశాల/కళాశాలలో పీజీటీ బయోసైన్స్, టీజీటీ మ్యాథ్స్, రెబ్బెన గురుకులలో పీజీటీ బయోసైన్స్, టీజీటీ మ్యాథ్స్, ఆసిఫాబాద్ గురుకులంలో జేఎల్ తెలుగు, జేఎల్ బాటనీ, పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. జేఎల్‌కు రూ.23,400, పీజీటీలకు రూ.18,200, టీజీటీలకు రూ.18,200 వేతనం చెల్లిస్తారని తెలిపారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

వేతనాలు రాక.. వెతలు తీరక

- కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు అందని వేతనాలు
- రూ.2 కోట్లకుపైగా పీఎఫ్ బకాయిలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం..
- మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సమ్మె నోటీసు ఇస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: సూర్యుడు ఉదయించకముందే విధుల్లోకి చేరి పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల జీవితాలు బాగుపడటం లేదు. రెండు నెలలుగా వేతనాలు అందకపోవడం, రూ.రెండు కోట్లకు పైగా పీఎఫ్ బకాయిలు ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 140 మంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరితోపాటు కంప్యూటర్ ఆపరేటర్లుగా, విద్యుత్, వాటర్ సప్లయ్ విభాగాల్లో మరో 35 మంది కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి మే నుంచి వేతనాలు రావడం లేదు. అలాగే మరో ఎనిమిది మంది ఎస్ఎంఆర్ కార్మికులు విధులు నిర్వర్తిస్తుండగా, వీరికి కూడా నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందించారు. అయినా ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని పేర్కొంటున్నారు. ఇటీవల ప్రజాఫిర్యాదుల విభాగంలోనూ కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేయగా, వంతుల వారీగా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కాంట్రాక్టు కార్మికులు చెబుతున్నారు.

మూడేళ్లుగా అందని పీఎఫ్

కాంట్రాక్టు కార్మికుల పీఎఫ్ ఖాతాలో మూడు సంవత్సరాలుగా డబ్బులు జమ చేయడంలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్మికుల పిల్లల పెళ్లి, విద్యా, తదితర ఖర్చుల కోసం పీఎఫ్ డబ్బులను వినియోగించుకుందామనుకున్నా ఖాతాలో ప్రభుత్వం డబ్బులు జమ చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2 కోట్లకు పైగా పీఎఫ్ డబ్బు బకాయిలు చెల్లించాల్సి ఉందని వారు వాపోతున్నారు. రోడ్లు, మురుగునీటి కాలువలను శుభ్రం చేసే క్రమంలో కార్మికులకు ఎలాంటి గాయాలు కాకుండా ఉండేందుకు గ్లౌజ్‌లు, షూలు ఇవ్వాల్సి ఉంటుంది. మూడు సంవత్సరాలుగా కార్మికులకు గ్లౌజ్‌లు, షూలు, నూనె, సబ్బులు, యూనిఫాం, తదితర వస్తువులు అందడం లేదు. చెత్త ఎత్తే సమయంలో గాజు పెంకులు, ఇతర పదునైన వస్తువులు గుచ్చుకుని గాయాల పాలవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వేతనాలు ఇవ్వాలని కమిషనర్‌కు సమ్మె నోటీసు

కాగజ్‌నగర్ రూరల్: రెండు నెలల పెండింగ్ వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో సమ్మెబాట పడతామని శుక్రవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన మే, జూన్ నెలల వేతనాలు, రెండేళ్ల పీఎఫ్ డబ్బులు చెల్లించాలని కోరారు. 15 రోజుల్లోగా చెల్లించని పక్షంలో సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్, జిల్లా కార్యదర్శి సంజీవ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, రమేశ్, శంకరమ్మ, డి.శంకర్, నవీన్, శోభ పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి. రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రతినెలా వేతనాలు చెల్లిస్తే బాగుంటుంది. సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మె బాట పడతాం.
– శంకర్, కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకుడు

పట్టించుకోవడం లేదు



కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. షూ, గ్లౌజ్‌లు, బట్టలు అందించడం లేదు. పనులు చేసేటప్పుడు రక్షణ లేక గాయాలవుతున్నాయి. ఉద్యోగానికి భద్రత లేక.. ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేస్తున్నాం. తమకు రావాల్సిన వేతనాలు వెంటనే అందించాలి.
– సంజీవ్, యూనియన్ నాయకుడు

వారం రోజుల్లో చెల్లిస్తాం

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలను వారం రోజుల్లో చెల్లిస్తాం. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
– అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

తిర్యాణి(ఆసిఫాబాద్): అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ కింద తిర్యాణి మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ నిర్దేశించిన ఐదు విభాగాలకు సంబంధించిన లక్ష్యాలను వంద రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 500 బ్లాకుల్లో తిర్యాణి బ్లాక్ మొదటిస్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ప్రతీ అధికారి క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. తిర్యాణి మండలంలో 30 ఏళ్లు పైబడిన వారందరూ తప్పనిసరిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు కుమురంభీం చౌరస్తాలోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు ఎంపీడీవో కార్యాలయం వరకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం గుస్సాడీ నృత్యంతో స్వాగతం పలికారు. సమావేశంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, డీపీవో భిక్షపతిగౌడ్, పంచాయతీరాజ్‌శాఖ ఈఈ ప్రభాకర్, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, సీడీపీవో సాదియా రుక్సాన, ఎంపీడీవో వేముల మల్లేశ్, ఎంపీవో సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

- ఎంపీ గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: తన గెలుపునకు సహకరించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లా కేంద్రానికి మొదటిసారి వచ్చిన ఆయనకు శుక్రవారం బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి ఘన స్వాగతం పలికాయి. అనంతరం జిల్లా కేంద్రంలోని అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు పేదల సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. ప్రజలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వివిధ మండలాల నాయకులు ఎంపీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, నాయకులు రేగుంట కేశవ్‌రావు, ఈదులవాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు ప్రజలతో మమేకం కావాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జెడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తికావడంతో ప్రత్యేకాధికారులుగా నియమితులైన వారు ప్రజలతో మమేకమై పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ ప్రత్యేకాధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, మండల అభివృద్ధి అధికారులతో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేవరకు అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.

గురుకులాల పని వేళలపై పునఃసమీక్షించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌రూరల్: గురుకుల విద్యా సంస్థలకు నిర్ణయించిన పని వేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులు, ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడిని పెంచేలా ఉన్నాయని టీఎస్ యూటీఎఫ్ జిల్లా గురుకులాల కోకన్వీనర్ కొమ్మినేని నరేశ్ అన్నారు. మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు భోజనం చేయకుండా కూర్చోవడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. స్టాఫ్ క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యాసంస్థల్లో టీచర్లు రాత్రి 9 గంటల వరకు ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సెలవుల్లో కూడా పని చేయాల్సి రావడంతో ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ఉన్న పనివేళలను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుచరిత, ఉపాధ్యాయులు రజీహైదర్, గోపి, నయీం, సంగీత, శిరిన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్యపరీక్షలు



ఉద్యోగిని పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో కాంట్రాక్టు ఉద్యోగుల కోసం మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేశారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల ఆకస్మిక మరణాల నేపథ్యంలో యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. బెల్లంపల్లి ఏరియాలో ఇప్పటివరకు 220 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మెడికల్ స్క్రీనింగ్ క్యాంపు ద్వారా ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిపై కచ్చితమైన సమాచారం యాజమాన్యం వద్ద ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సత్యానారాయణ, మేనేజర్ ప్రవీణ్‌ఫాటింగ్, సేఫ్టీ అధికారి మధుసూదన్, వెల్ఫేర్ అధికారి వేణు, గోలేటి ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళి, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కొక్కరుగా..

- బీఆర్‌ఎస్‌ను వీడుతున్న ముఖ్యనేతలు
- తాజాగా ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్‌లో చేరిక
- ఇప్పటికే పూర్తయిన జెడ్పీ పాలకవర్గాలు
- 'గులాబీ' ఆధీనంలో ఇక మూడే మున్సిపాలిటీలు
- ఉమ్మడి జిల్లాలో పట్టుకోల్పోతున్న 'కారు' పార్టీ



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సాక్షి,ఆదిలాబాద్: బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు ఒకరొకరుగా ఆ పార్టీని వీడుతున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ గురువారం అర్ధరాత్రి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఎగువ సభలో ఉమ్మడి జిల్లా నుంచి ఆ పార్టీ ప్రాతినిధ్యం కోల్పోయినట్లయింది. ఇదిలా ఉంటే పరిషత్ పాలకవర్గాలు ముగిసిపోవడంతో ఆ పార్టీకి చెందిన జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు మాజీలయ్యారు. ఒక విధంగా ఈ పదవుల ద్వారా పార్టీ క్షేత్రస్థాయిలో ప్రాతినిధ్యం కనిపిస్తుండగా ఇప్పుడు అవి లేకుండా పోయాయి. ఇక ఉమ్మడి జిల్లాలోని అనేక మున్సిపాలిటీ పాలకవర్గాలను కాంగ్రెస్ ఇప్పటికే హస్తగతం చేసుకుంది. దీంతో స్థానిక సంస్థల్లో గులాబీ పార్టీ బలహీనంగా మారింది.

ఎమ్మెల్సీ విఠల్ హస్తం గూటికి..

ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ బీఆర్‌ఎస్‌ను వీడారు. గురువారం అర్ధరాత్రి మరో ఐదుగురు ఎమ్మెల్సీలతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 2022 జనవరి 4 నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న విఠల్ పదవీకాలం ఆరేళ్లు. ఇంకా మూడున్నరేళ్ల గడువు ఉంది. కాగా ఆయన ఎన్నిక చెల్లదంటూ సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ప్రధానంగా ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేసేందుకు నామినేషన్ వేయగా, ఫోర్జరీ సంతకాలతో తన నామినేషన్‌ను తొలగించారని ఆయన న్యాయస్థానంను ఆశ్రయించిన విషయం విధితమే. విచారణ అనంతరం కోర్టు దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చింది. దీనిపై ఎమ్మెల్సీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అది విచారణలో ఉండగానే తాజాగా ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇదిలా ఉంటే రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే ఉన్నారు. తదుపరి ఈ ఎన్నిక విషయంలో ఏం జరుగుతుందనేది వేచి చూడాల్సిందే.

మిగిలింది ఇద్దరు ఎమ్మెల్యేలే..

ప్రస్తుతం బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 మున్సిపాలిటీ పాలక వర్గాల్లో ఇప్పుడు కేవలం మూడు చోట్ల ఆదిలాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్‌లో మాత్రమే ఆ పార్టీ ప్రాతినిధ్యం ఉంది. భైంసా తప్పితే మిగతా వాటిని కాంగ్రెస్ తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. ఆదిలాబాద్, నిర్మల్‌లో బీఆర్‌ఎస్ జెడ్పీచైర్మన్లు ఉండగా ఇక వారు మాజీలు అయిపోయారు. మంచిర్యాలలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. జెడ్పీ పాలకవర్గాల గడువు ముగియడంతో వీటిలోనూ బీఆర్‌ఎస్ ప్రాతినిధ్యం కోల్పోయినట్లయింది.

నియోజకవర్గాల్లో నేతలు కరువు..

ఎమ్మెల్సీ విఠల్ హస్తం పార్టీలో చేరడంతో బీఆర్‌ఎస్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో షాక్ తగిలినట్లయింది. అక్కడ పార్లమెంట్ ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌లో చేరడంతో దండే విఠల్ అక్కడ పార్టీకి కీలక నేత ఆయ్యారు. ఇప్పుడు ఆయన కూడా పార్టీ వీడడంతో అక్కడ నాయకత్వం కరువైంది. ఇది వరకే లోక్‌సభ ఎన్నికల ముందు నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యేలు ముథోల్‌లో విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ పార్టీ వీడిన విషయం తెలిసిందే. డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి గతంలోనే కాంగ్రెస్‌లో చేరారు. బోథ్‌లో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఆసిఫాబాద్‌కు చెందిన ముఖ్యనేత అరిగెల నాగేశ్వర్ కూడా బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇలా పలు నియోజకవర్గాల్లో ముఖ్య నేతలను పార్టీ కోల్పోయింది. మొత్తంగా ప్రస్తుతం ఆ పార్టీలో స్తబ్ధత కనిపిస్తోంది.

నేతల మధ్య సఖ్యత కుదిరేనా?

స్థానిక నాయకులకు ఇష్టం లేకున్నా బీఆర్‌ఎస్ నుంచి ఇప్పటికే మాజీ మంత్రి ఐకేరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపూరావు, కోనేరు కోనప్ప, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ తదితర సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా పార్టీ మారిన ఎమ్మెల్సీ దండే విఠల్ సొంత నియోజకవర్గం సిర్పూర్ కాగా ఇప్పటికే అక్కడ బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేరారు. అక్కడ రావి శ్రీనివాస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. విఠల్ రాకతో స్థానికంగా మూడు వర్గాలుగా పార్టీ ఉండనుంది. దీంతో కొత్త, పాత నాయకుల మధ్య సఖ్యత కుదురుతుందా అనే చర్చ నడుస్తోంది. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో సమన్వయం కొరవడి పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఓడిపోయారనే వాదనలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కేడర్ బలంగా ఉండి కూడా సీటు కోల్పోవాల్సి వచ్చింది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల పరిధిలోని ఆయా సెగ్మెంట్లలో అధికార పార్టీలో కొత్త, పాత నాయకుల మధ్య వర్గపోరు మొదలైంది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులు నాయకుల మధ్య చిచ్చు పెట్టే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు పార్టీ మారిన నాయకులు నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కొత్త వారి రాకతో ఏళ్లుగా జెండా మోస్తున్న వారికి నష్టం జరుగుతుందని సీనియర్లు వాపోతున్నారు.

అభివృద్ధి కోసమే..

జిల్లాలో అభివృద్ధి పనుల కోసమే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరాను. ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి దోహదపడతాను.
– దండే విఠల్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ

బొగ్గు గనులు సింగరేణికి కేటాయించాలి

- కలెక్టరేట్ ఎదుట వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు



ధర్నా చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేట్ వారికి అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు ఈ నెల 17 వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి సోమారం తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యక్షుడు మురళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శంకర్, కిరణ్, బాబు, చంద్రశేఖర్, రాజేశ్, ఫిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, అశోక్, రామయ్య, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో...

బొగ్గు గనుల వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం దినకర్ మాట్లాడుతూ శ్రావణపల్లి బొగ్గు గనిని సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం ప్రక్రియ నిర్వహించడం అన్యాయమన్నారు. బొగ్గుగనుల వేలాన్ని నిలిపివేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. నాయకులు గొడిసెల కార్తీక్, జాదవ్ రాజేందర్, టీకానంద్, మాలశ్రీ, తిరుపతి, నిఖిల్, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి


చుక్కల దుప్పి కళేబరం

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో కుక్కల దాడిలో శుక్రవారం చుక్కల దుప్పి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం సుమారు 3గంటల ప్రాంతంలో కుక్కలు అటవీ ప్రాంతం నుంచి దుప్పిని తరుముకుంటూ గ్రామ సమీపంలోని పంట చేలల్లోకి వచ్చాయి. గమనించిన రైతులు దుప్పిని కాపాడటానికి ప్రయత్నించినా అది తీవ్ర గాయాలతో మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న బీట్ అధికారులు అమరేందర్, మహేశ్ పంచనామా నిర్వహించి దుప్పి కళేబరాన్ని దహనం చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

గుట్కా పట్టివేత


పట్టుకున్న గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలోగల ఓ నివాసంలో శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన విజయ్ తహలాని ఇంటిలో అక్రమంగా నిల్వ చేసి అమ్మకానికి సిద్ధం చేసిన రూ.38,040 విలువైన గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు విజయ తహలానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బంది మధు, రమేశ్ తదితరులున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జన్నారం: తమ పత్తి చేనులో వేరే వారు దున్నుతుండగా, అడ్డుకోబోయిన భూక్య బలరాంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కుటుంబ సభ్యులు పవార్ శశికళ, దేవిదాస్, రాథోడ్ శ్రీనివాస్, లావణ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత నెల 28వ తేదీన పత్తి చేనులో దున్నుతున్న రమేశ్‌ను అడ్డుకోబోగా, అతడు కర్రతో బలరాంను కొట్టగా తీవ్ర గాయాలయ్యాయని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. కొట్టి గాయపరిచిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎస్సై రాజవర్ధన్‌ను సంప్రదించగా బలరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

- పెంపుడు కుక్కలతో జర భద్రం
- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- రేబిస్ నివారణ టీకా తప్పనిసరి
- నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం


లాబ్రడార్ జాతి పెంపుడు కుక్క

పెంపుడు జంతువుల వివరాలు	
ఆదిలాబాద్ జిల్లా	
గేదెలు	48,650
ఆవులు	3,11,182
గొర్రెలు	1,53,214
మేకలు	1,86,469
పందులు	1,890
కుక్కలు	5,267
కుందేళ్లు	70
కోళ్లు	5,47,969
పక్షులు	5789

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా	
గేదెలు	49,445
గొర్రెలు	1,60,958
మేకలు	2,59,539
ఆవులు, ఎద్దులు	26,451

ఆసిఫాబాద్‌అర్బన్/మంచిర్యాలఅగ్రికల్చర్/కైలాస్‌నగర్/నిర్మల్‌ఖిల్లా: కుక్కలు, పశువులు, ఇతర జంతువులు, కోళ్లు, పక్షుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల విషయంలో పశుపోషకులు, జంతుప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి. పశువులు, వాటి పాకల అపరిశుభ్రత, తదితర కారణాలతో సుమారు 200 రకాల వ్యాధులు సోకే అవకాశముంది. వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయాల్సిన, వ్యాధులపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముంది. శనివారం జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా పశు వైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి ఈ శంకర్ పలు సూచనలు చేశారు. పెంపుడు కుక్కలు, ఇతర జంతువుల యజమానులు రేబిస్ నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. పశువైద్యశాలల్లో రేబిస్ నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రేబిస్ సోకిన వీధికుక్కలు కరిస్తే పాడిపశువులు మృత్యువాత పడే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

జూన్ 6న ఎందుకంటే..

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు కొన్ని సంవత్సరాలుగా టీకాలతో బ్రిటిష్ దేశ శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేశారు. 1885 జులై 6వ తేదీన లూయిస్ ప్యాచర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జులై 6వ తేదీని ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తూ వస్తున్నారు.

పశువులకు రేబిస్ సంక్రమణ ఇలా..

పశువులను పిచ్చికుక్కలు కరవడం ద్వారానే ఎక్కువగా రేబిస్ సంక్రమిస్తుంది. వైరస్‌తో కలుషితమైన పిచ్చికుక్క చొంగ పశువుల గాయాలు, పుండ్లకు అంటుకున్నా ఈ వ్యాధి సోకుతుంది. రేబిస్ ఎక్కువగా కుక్కల ద్వారా, ఆ తర్వాత పిల్లులు, ముంగీసలు, నక్కలు, తోడేళ్లు తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు సోకుతుంది. ఎక్కువగా పశువుల కేంద్రనాడీ మండలాన్ని ఆశించి వ్యాధిగ్రస్తం చేయడంతో చివరగా పశువుల్లో పక్షవాతం వస్తుంది. తదనంతరం అవి మరణిస్తాయి. కుక్క కరిచిన తర్వాత వ్యాధి లక్షణాలు 2 నుంచి 3 వారాల తర్వాత కనబడతాయి. ఒక్కోసారి 5 నుంచి 6 నెలల తర్వాత కూడా బయటపడతాయి. మెదడుకు దగ్గరగా ఉన్న ముఖం, మెడ ప్రాంతాల్లో కరిస్తే వ్యాధి లక్షణాలు త్వరగా కనబడతాయి.

ఎక్కువగా సంక్రమించే వ్యాధులు..

పశువుల కాపరులు, పశు వైద్యవృత్తిలో ఉన్నవారు, జంతు ప్రేమికులు, సరదా కోసం కుక్కలు, పక్షుల్ని పెంచేవారు, పశువుల డెయిరీఫాంలలో పని చేసేవారు, పాలు, పాల ఉత్పత్తుల్ని ఆహారంగా తీసుకునే వారు, మాంసాహారులు.. వీరంతా

అంత్రాక్స్, బ్రూసెల్లోసిస్..

పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు అనేకం. దొమ్మ (అంత్రాక్స్) మటన్ కొట్టేవారికి, గొర్రెలు, మేకలు, పశువులు చనిపోతే చర్మకోసం వాటిని కోసేవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదముంది. కొమ్ములు, చర్మం, ఎముకలతో సంబంధమున్న పరిశ్రమల్లో పని చేసే వారికీ ఈ వ్యాధి రావచ్చు. మరో వ్యాధి బ్రూసెల్లోసిస్. ఇది డెయిరీ ఫాంలలో పని చేసే వారికి, పశువైద్యులకు సోకే అవకాశముంది. వ్యాధి సోకిన వారికి నపుంసకత్వం రావచ్చు. వ్యాధి సోకిన పశువుల గర్భకోశం నుంచి సంక్రమించే ద్రవం, చీము, వీర్యం ద్వారా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గర్భస్రావం జరిగిన పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించి, సరిగా వైద్యం చేయిస్తే ఈ వ్యాధిని అరికట్టవచ్చు. వ్యాధి నివారణకు టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

జూనోటిక్ వ్యాధుల విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పెంపుడు కుక్కల్ని శాస్త్రీయ పద్ధతిలో, పశువైద్యుని సలహాల మేరకు అన్ని జాగ్రత్తలతో పెంచకుంటే వాటి నుంచి సంక్రమించే వ్యాధులు ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. జూనోటిక్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే శుచి, శుభ్రత పాటించడం చాలా అవసరం.

పెంపుడు కుక్కలకు టీకాలు..

సకాలంలో రేబిస్ నివారణ టీకాలు వేయిస్తే యజమానులు, కుటుంబ సభ్యులతోపాటు సమీప నివాసాలవారు, పశువులు, కుక్కల్ని రేబిస్ కంబంధహస్తాల నుంచి రక్షించిన వారవుతారు. ఇంట్లో పెంచే పెంపుడు కుక్కలకు మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90 రోజులకు, దీంతో పాటు ఏటా 'రేబిస్' నివారణ టీకాలు వేయించాలి. కుక్కలతో సన్నిహితంగా ఉండేవారు రేబిస్ సోకకుండా వ్యాధి నివారణ టీకాలు వేయిస్తూ ఉండాలి.

కలుషితమైన పాలతో క్షయ

కలుషితమైన పాలు తాగితే క్షయ సోకుతుంది. దీని బారిన పడకుండా ఉండాలంటే పచ్చిపాలు తాగకూడదు. బాగా మరగకాచి, చల్లార్చిన పాలనే తాగాలి.

పిచ్చికుక్క కాటుతో రేబిస్..

పిచ్చి కుక్క కాటుతో పశువులు, కుక్క కరిచిన మనుషులకు రేబిస్ సోకుతుంది. ఇది ప్రాణాంతకమైంది. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. కుక్కల ద్వారా గజ్జి లాంటి చర్మ వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయి. పిచ్చికుక్క కాటుతో పశువులు, మనుషుల్లోనూ సోకే అతి ప్రమాదకరమైన వ్యాధి రేబిస్. ఇది రోబ్డోవైరస్ క్రిములతో సంభవిస్తుంది. ఈ వ్యాధి సోకితే మృత్యుముఖం నుంచి బయటపడడం అసాధ్యం. ఊరకుక్కలు అధికంగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పశువులు, మనుషులు పిచ్చికుక్కల కాటుకు గురవుతూ ఉండగా మరణాలు సంభవిస్తున్నాయి.



ఇక ఎలుకలు ఎక్కువగా తిరిగే ధాన్యం గిడ్డంగుల్లో పని చేసే వారికి లెప్టోస్పైరోసిస్ సోకుతుంది.

ఈ వ్యాధులు కూడా..

హైడాటిసిస్, ఎకైనోకోకస్ (అంతర్గత పరాన్నజీవులు) కారణంగా కూడా మనుషులకు జూనోటిక్ వ్యాధులు సోకుతాయి. పశువులు, కుక్కల శరీరంలో ఉండే బద్దె పురుగులు గుడ్లు పెడతాయి. అవి కుక్కలు, పశువుల శరీరంలోని వివిధ భాగాల్లో ఉండిపోతాయి. అలాంటి పశువుల మాంసాన్ని సరిగా ఉడికించకుండా తింటే బద్దె పురుగుల గుడ్లు మనుషుల శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యాన్ని కలుగజేస్తాయి. మాంసాన్ని సరిగా ఉడికించి తిన్నట్లయితే వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇక కోళ్ల ఫాంలలో పని చేసే వారికి, సరిగా ఉడికించని గుడ్లు, మాంసం తిన్నవారికి సాల్మోనుల్లోసిస్ సోకుతుంది. కుళ్లిన ఆహార పదార్థాలు తిన్నవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు. అపరిశుభ్రమైన ఆవాసాల్లో ఉన్నవారికి, కుక్కలతో సాన్నిహిత్యం ఉన్నవారికి చర్మ వ్యాధులు సోకుతాయి.

నివారణ ఇలా..

వ్యాధులు సోకిన జంతువులు, కోళ్ల మాంసం, గుడ్లు సరిగా ఉడికించకుండా తినకూడదు. పాడైన, అపరిశుభ్రంగా ఉన్న పాలు, మాంసం, గుడ్లను ఆహారంగా తీసుకోకూడదు. రేబిస్ సోకిన పశువుల పాలు తాగకూడదు. పాడి పశువులు, జంతువుల పాకలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచాలి. పశువులు, జంతువులు, పక్షులు, కోళ్లకు కాలానికి అనుగుణంగా రోగ నిరోధక టీకాలు వేయించాలి. చనిపోయిన పశువులు, జంతువులను దూరప్రాంతాల్లో లోతైన గోతిలో సున్నం చల్లి పూడ్చి పెట్టాలి.

తప్పనిసరిగా టీకాలు వేయిస్తాను



ఆరేళ్లుగా లాబ్రడార్ కుక్కను పెంచుతున్నాం. మా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ప్రేమగా చూసుకుంటాం. శుభ్రత, తిండి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటాం. వ్యాధులు రాకుండా టీకాలు వేయిస్తున్నాం. ప్రతీ సంవత్సరం రేబిస్ నివారణ టీకాతో పాటు, సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఇతర టీకాలు వేయిస్తాం.
– సాయికృష్ణ, మంచిర్యాల

వారంపాటు టీకా వేస్తాం



కుందేళ్లు, పక్షులు, పిల్లుల తోపాటు శునకాలను పెంచుకునే వారి సంఖ్య పెరిగింది. ప్రతీరోజు 80 నుంచి 100 మంది దాకా పెంపుడు కుక్కలకు టీకాలు వేయించేందుకు వస్తారు. జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో ఏడాది పొడవునా శునకాలకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్నాం. కుక్కలు, పిల్లుల పెంపకందారులు ప్రతీ ఆర్నెళ్లకోసారి తమ పెంపుడు జంతువులకు టీకా తప్పనిసరిగా వేయించాలి. శనివారం నుంచి వారంపాటు వైద్యశాలలో పెంపుడు జంతువులకు టీకా వేస్తాం.
– గోపి కిషన్, సహాయ సంచాలకుడు, ఆదిలాబాద్ జిల్లా పశు వైద్యశాల

అప్రమత్తత అవసరం



జంతువుల ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాప్తి చెంది మనుషులకు సోకుతాయి. చర్మ సంబంధిత, శ్వాసకోశ, పేగు సంబంధిత వ్యాధులతో పాటు ప్రమాదకరమైన రేబిస్ సోకే ప్రమాదముంది. పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. పిచ్చికుక్క మనుషులను ఛాతిపై భాగంలో ఎక్కడ కాటు వేసినా అత్యంత ప్రమాదకరం. కుక్కలను పెంచుకునేవారు ఆర్నెళ్లకోసారి రేబిస్ నివారణ టీకా వేయించాలి.
– రామారావు, ఆదిలాబాద్ జిల్లా సహాయ పశుసంవర్ధకశాఖ అధికారి

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలి. ప్రధానంగా కుక్కలను దవాఖానాకు తీసుకువచ్చి టీకాలు ఇప్పించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పెంపుడు జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమించే ప్రమాదముంది. ప్రతి ఒక్కరూ జీవాలపై కరుణ కలిగి ఉండాలి. అదే సమయంలో తగిన జాగ్రత్తలూ తీసుకోవాలి.
– ప్రియాంక, పశువైద్య నిపుణులు, నిర్మల్

వ్యాధులు రాకుండా చూస్తా



మా వ్యవసాయ క్షేత్రంలో ఆవులు, గేదెలు పెంచుతున్నాను. వాటి ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపిస్తాను. అవసరమైతే పశువైద్యులను సంప్రదించి ఇంజక్షన్లు, టీకాలు వేయిస్తాను. ఏమాత్రం అనారోగ్యంగా ఉన్నా వైద్యం చేయిస్తాను. పశువులను పూర్తి ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తాను.
– మన్మోహన్‌రెడ్డి, రైతు, చింపోలి (బీ)

వ్యాక్సినేషన్ అవసరమే..



నేను రిటైర్డయ్యాక మా వ్యవసాయ క్షేత్రంలో పశువుల తోపాటు కుక్కనూ పెంచుతున్నాను. ప్రతీరోజు పశువులకు మేత, కుక్కకు మంచి ఆహారం అందిస్తున్నాను. వాటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటిస్తాను. వాటికి అత్యంత సన్నిహితంగా ఉంటాను కాబట్టి ఇంజక్షన్లు, టీకాలు కూడా వేయిస్తుంటాను.
– సంపత్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగి, నిర్మల్

వైద్యుల సలహాలు పాటిస్తా



నేను పదేళ్లుగా కుక్కలు పెంచుకుంటున్నాను. వాటిని జాగ్రత్తగా చూసుకుంటున్నాను. సమయానికి కావాల్సిన ఆహారం, నీరు అందిస్తాను. ఆరు నెలలకోసారి ఆస్పత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్లు వేయిస్తాను. వాటితో ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా తప్పకుండా వైద్యుల సలహాలు పాటిస్తాను.
– మంథెన సంతోష్, ఆసిఫాబాద్

పురుగుల అన్నం పెడుతున్నారని ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే ఓసీపీ మట్టి తవ్వకాలు చేపడుతున్న వారాహి కాంట్రాక్టు కంపెనీ తమకు నాణ్యమైన భోజనం అందించడం లేదని కార్మికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం షిఫ్టులో వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. మూడురోజులుగా నాసిరకంగా భోజనం పెడుతున్నారని ఆరోపించారు. భోజనంలో పురుగులు వస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని వాపోయారు. బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నప్పటికీ నాణ్యమైన భోజనం అందించడం లేదని తెలిపారు. అధికారులు కంపెనీపై చర్యలు తీసుకోవాలని, నాణ్యతమైన భోజనం అందించేలా చూడాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష


బైక్‌పై పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో గల అభివృద్ధి పనులపై క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శుక్రవారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో బైక్‌పై పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని కమిషనర్ గంగాధర్‌ను ఆదేశించారు. అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, ఏఈలు, సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అస్నాద భూములపై సమీక్ష

చెన్నూర్: మండలంలోని అస్నాద గ్రామస్తులు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములపై స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఫారెస్ట్ డీఎఫ్‌వో శివ్ ఆశీస్‌సింగ్, ఎఫ్‌డీవో రమేశ్, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎందుకు అడ్డుకుంటున్నారని ఫారెస్ట్ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని ఫారెస్ట్ భూములు ఇప్పుడు ఎలా వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించగా అధికారులు సానుకూలంగా స్పందించారు. శనివారం అస్నాద భూములను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

మృతదేహం లభ్యం


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం కెలికే గ్రామ సమీపంలోని కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. జైనూర్ మండలం జామ్ని గ్రామానికి చెందిన జాదవ్ ప్రకాశ్ కెరమెరి మండలం లేండిగూడ నుంచి జైనూర్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి కల్వర్టు కింద పడ్డాడు. నీటి ప్రవాహంలో ఖైరీ వాగు దాకా సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు కొట్టుకుపోయాడు. శుక్రవారం కొందరు చెట్టుకు తట్టుకుని ఉన్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహం అప్పగించారు. మృతుడి బావ జాదవ్ శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడికి బీజేవైఎం పిలుపునివ్వడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష అభ్యర్థులను 1:100 ప్రాతిపదికన ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్–2, 3 ఉద్యోగ నియామకాల్లో పోస్టుల సంఖ్య పెంచాలని కోరారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాడితే కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు అరెస్ట్ చేయడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాని ప్రభుత్వం నిరుద్యోగుల కోసం పోరాడే బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసి, తమ పోరాటాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీజేవైఎం నాయకులు తులా ఆంజనేయులు, బింగి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్, ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో తొమ్మిది ఫార్మసిస్ట్ పోస్టులు భర్తీ చేసేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ నోటిఫికేషన్ ఇచ్చినట్లు డీఎంహెచ్‌వో అనిత ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈ నెల 6నుంచి 9వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు https:// mancherial. telangana. gov. in ను సందర్శించాలని సూచించారు.

సీఎం విదేశీవిద్య పథకానికి..

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసించే అర్హత గల అభ్యర్థులకు 2024 విద్యాసంవత్సరానికి సీఎం విదేశీవిద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరం స్ప్రింగ్ ప్రవేశాలకు విదేశీ విద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్/డాక్టోరల్ కోర్సులు చదువుకునేందుకు ఉపకార వేతనాలు/ఆర్థిక చేయూత మంజూరు కోసం అన్ని అర్హత ప్రమాణాలను పూర్తి చేసి, జనవరి 1, 2024 నుంచి జులై 31, 2024 కాలంలో అడ్మిషన్ తీసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. www. telanganaepass. cgg. gov. in ద్వారా ఈ నెల 8నుంచి ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాముకాటుకు గురైన పదినెలల బాలుడు

- వైద్యానికి సాయం కోరుతున్న తల్లిదండ్రులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాన్సన్

మందమర్రిరూరల్: సీసీసీలో నివాసముండే చెన్నూర్‌కు చెందిన కీర్తి–జీవన్‌కుమార్ దంపతుల పది నెలల కుమారుడు జాన్సన్ గురువారం మందమర్రిలోని గాంధీనగర్‌లోగల తన అమ్మమ్మ ఇంటిలో పాముకాటుకు గురయ్యాడు. వెంటనే తల్లిదండ్రులు బాబును చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాబు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు తెలిపారు. కాగా, తమది పేద కుటుంబం కావడంతో బాబుకు మెరుగైన వైద్యం చేయించే స్తోమత లేదని కీర్తి–జీవన్‌కుమార్ వాపోయారు. దాతలు సాయం చేసి తమ బాబును కాపాడాలని వేడుకుంటున్నారు. 7993411825, 62318845201 నంబర్లకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యసేవలు


మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలోని జీవీఆర్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి జబ్బులున్నట్లయితే మందులు అందజేస్తామని తెలిపారు. ప్రతీ కాంట్రాక్టు ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి ఆహార అలవాట్లు, నిత్యం వ్యాయామం చేస్తే జబ్బులు రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం ఏవీ రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టీ శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, రక్షణ అధికారి శ్రీధర్‌రావు, గని మేనేజర్ బ్రహ్మాజీ, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, గని సంక్షేమ అధికారి శంకర్, పిట్ సెక్రటరీ లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

- తమ్ముడి పరిస్థితి విషమం

చెన్నూర్: తల్లి చనిపోయి పుట్టెడు దుఃఖం నుంచి తేరుకుని దశదిన కర్మ చేసిన కుమారులిద్దరూ కూతురు ఇంటికి నిద్రకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో అన్న మృతి చెందగా తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన సింగనవేణి పర్వతాలు (40) తల్లి పక్షంరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తల్లి దశదిన కర్మ పూర్తి కావడంతో కోటపల్లి మండలం బబ్బెరచెలుక గ్రామంలోని పర్వతాలు కుమార్తె శుక్రవారం నిద్రకు పిలిచింది. దీంతో పర్వతాలు తన తమ్ముడు ఓదెలుతో కలిసి శుక్రవారం రాత్రి దుగ్నెపల్లి నుంచి బబ్బెరచెలుక గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. చెన్నూర్ పట్టణంలోని జాతీయ రహదారి కొత్త పెట్రోల్ బంక్ వద్ద వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనగా పర్వతాలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఓదెలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఓదెలును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.